క్లుప్తంగా

విద్యుత్ తీగలు అమర్చొద్దు



వాజేడు: పంటల రక్షణ కోసం, వన్యప్రాణాలను వేటాడడం కోసం విద్యుత్ తీగలు అమర్చొద్దని ఎస్సై రాజ్‌కుమార్ సూచించారు. విద్యుత్ ఉచ్చులను అమరుస్తున్న మండలంలోని ములుకనపల్లి గ్రామానికి చెందిన కుడెం లాలయ్య, కుడెం కృష్ణ, మడకం రాజు, సప్కా లాలు, కోడె శ్రీనివాస్‌ను ఎస్సై అరెస్టు చేసి తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్య ప్రాణుల నుంచి పంట రక్షణ కోసం, వన్య ప్రాణులను వేటాడడం కోసం విద్యుత్ తీగెలను అమర్చడం ద్వారా మనుషుల ప్రాణాలు కూడా పోతున్నాయని అన్నారు. వన్యప్రాణులను చంపడం చట్ట ప్రకారం నేరమని విద్యుత్ తీగెలను ఎవరూ అమర్చినా అలాంటి వారిపై చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

అటకెక్కిన 'ఆరు గ్యారంటీలు'



వెంకటాపురం(కె): కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ మాటలతో ప్రజలను మోసం చేస్తుందని బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు సొల్లేటి గణేష్ చారి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆరు గ్యారంటీలను ప్రకటించి అటకెక్కించిందన్నారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలను గ్రామాల్లోని ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో బహుజన పార్టీ విజయం సాధిస్తుందని తెలిపారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఇప్పుడు లబ్ధిదారుల లిస్టులో పేర్లు లేని వారు ఇంకా దరఖాస్తులను చేసుకోవాలని ప్రకటించడం ప్రజలను మోసగించడమేనన్నారు.

పశువుల పట్టివేత

ఏటూరునాగారం: మండలంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శనివారం స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొన్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. చర్ల నుంచి ఏటూరునాగారం మీదుగా హైదరాబాద్ వెళ్తున్నట్లు పట్టుబడిన వ్యక్తులు తెలిపారన్నారు. 25 పశువులను పట్టుకుని భూపాలపల్లిలోని గోశాలకు తరలించి డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి తెలిపారు. డ్రైవర్, క్లీనర్, అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేగొండ: కులగణన, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ కోయిల క్రాంతి, రవి, తరుణ్, భాస్కర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

భూపాలపల్లి రూరల్: తాటిచెట్ల పంపిణీ విషయంలో జరిగిన వివాదాల వల్ల తనకు తాటిచెట్లలో భాగం ఇవ్వకుండా కుల సంఘం నుంచి వెలివేసిన వారిపై అధికారులు చర్య తీసుకోవాలని మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన పల్లెర్ల లక్ష్మినారాయణ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బహిష్కరణ విషయంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదనట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులు విచారించి కుల బహిష్కరణ ఎత్తివేసి తాళ్లలో భాగం ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

టేకుమట్ల: మండల కేంద్రంలో ఈ నెల 25 నుంచి క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ మేరకు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా క్రికెట్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే వారు ఈ నెల 20 వరకు టీమ్‌ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రూ.2500 ఎంట్రీ ఫీజు ఉన్న క్రికెట్ మ్యాచ్‌లో మొదటి బహుమతి రూ.100016, ద్వితీయ బహుమతి 50016 ఉంటుందని తెలిపారు. వివరాలకు 90142 39632, 95023 07110, 77025 61928 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా రహదారి

- వలుచోట్ల దెబ్బతిన్న రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చిప్స్ లేచి ప్రమాదకరంగా ఉన్న రహదారి

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం నుంచి వెంకటాపురం(కె) మండల కేంద్రం వరకు వాజేడు–భద్రాచలం రహదారి పలు చోట్ల మరమ్మతులకు గురై అధ్వానంగా మారింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రహదారిపై చిప్స్ లేచి ఉండటంతో అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడి పడుతున్నారు. ఈ క్రమంలో గాయాల పాలవడంతో పాటు ప్రాణలు కూడా పోతున్నాయి. అధికారులు మాత్రం రహదారిని మరమ్మతులు చేయించే విషయంలో పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా మొరుమూరు కాలనీ గ్రామ సమీపంలో అల్లి వాగు బ్రిడ్జి వద్ద రహదారి దెబ్బతింది. గుండ్ల వాగు బ్రిడ్జి సమిపంలో ఇదే పరిస్థితి. ఆరుగుంటపల్లి, ప్రగళ్లపల్లి గ్రామాల మధ్యన రహదారి ప్రమాదకరంగా మారింది. దెబ్బతిన్న రహదారులను సంబంధిత శాఖాధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతు గురైన రహదారిని మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య



గోవిందరావుపేట: మాట్లాడుతున్న సూర్య

గోవిందరావుపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి సూర్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రసాద్‌రావు నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్య హాజరై టోర్నమెంట్ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ.. అంతరించి పోతున్న క్రీడలను నేటి యువతకు పరిచయం చేసిన ఘనత అరుణోదయ యూత్ క్లబ్ వారిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ, అరుణోదయ యూత్ క్లబ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. శనివారం మండలంలోని లింగాల, బంధాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచుల గ్రామాల పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పార్టీ విజయం కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చుపటేల్ , తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర ,ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మంకిడి ప్రశాంత్ పాల్గొన్నారు.

త్వరలో బ్రిడ్జి పనులు ప్రారంభం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండాయిలో కూలిపోయిన బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జిని నిర్మించేందుకు తొలుత రూ.9.50 కోట్లు మంజూరు చేశారన్నారు. అయితే బ్రిడ్జి ఎస్టీమేట్స్ వేసిన తర్వాత ఆ నిధులు సరిపోవని మంత్రి సీతక్క సీఎం దృష్టికి తీసుకెళ్లగా దానిని రూ.16కోట్లకు పెంచినట్లు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే ఏజెన్సీ ప్రజల కళ నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్సవడ్ల వెంకన్న, గుడ్ల దేవేందర్, వసంత శ్రీనివాస్, ఆయూబ్, ఖలీల్, లాలయ్య, నర్సింహారావు, బాలరాజు, రియాజ్, సులేమాన్, రాములు, రవీందర్, ప్రసాద్, మొండయ్య, రాంబాబు పాల్గొన్నారు.

జాతర పనుల పరిశీలన



వన దేవతలను దర్శించుకుంటున్న ఎస్సై

కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్‌లో ఈ నెల 12 నుంచి 15 వరకు జరిగే జాతర పనులు, భద్రత ఏర్పాట్లను ఎస్సై వెంకటేశ్ శనివారం పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఐలాపూర్ చేరుకోని జాతరకు వచ్చే భక్తులకు కావాల్సిన వసతులను ఆరా తీశారు. భద్రతపై తీసుకోవాలసిన చర్యలను పూజారులతో, గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ఎస్సై వనదేవతలను దర్శించుకోని మొక్కులు సమర్పించారు.

అడవి సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

- ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి అశోక్‌కుమార్

మంగపేట: అడవి సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ మంగపేట రేంజ్ ఇన్‌చార్జ్ అధికారి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్, అరుణ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, వన్యప్రాణుల సంరక్షణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి మాట్లాడుతూ.. అటవీ గ్రామాల ప్రజలు గ్రామాలకు సమీప అడవుల్లో అగ్నిప్రమాదాలు జరుగకుండా చూడాలని అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమాచారం ఇచ్చి అటవి సరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణులను కాపాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ బీటాఫీసర్ ప్రశాంత్‌కుమార్, రవీన్, బాలకృష్ణ, సౌజన్య, శ్రీలత పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సతీశ్

వెంకటాపురం(కె): ఐసీడీఎస్ సూపర్ వైజర్, డీడబ్ల్యూఓపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ సతీశ్ కోరారు. మండల పరిధిలోని శాంతినగర్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీడీపీఓ ధనలక్ష్మి ఆత్మహత్యాయత్నంకు కారణమైన సూపర్‌వైజర్, డీడబ్ల్యూఓలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తే నిజా నిజాలు తెలుస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలో కలెక్టర్ విచారణ చేపట్టాలని ఆయన కోరారు. సంఘటన జరిగి రోజులు గడుస్తున్నప్పటికీ విచారణ కోసం పంపించిన అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వారికి నచ్చిన వారితో సమావేశం నిర్వహించి వెళ్లి పోయినట్లు ఆరోపించారు. తాటి రాంబాబు, పూనెం అర్జున్, తాటి నాగరాజు, బొగ్గుల రాజ్ కుమార్, మడకం దేవి కుమారి, మడకం రమేష్, మడకం కృష్ణ వేణి, దీపిక తదితరులు ఉన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

వాజేడు: అడవి జంతువుల మూలంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీలో రైతులు సాగు చేసిన పంటలపై అడవి జంతువులు దాడి చేసి నష్టపరుస్తున్నాయని అటవీ శాఖ నుంచి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీలోని రెండో ఆదాయ వనరుగా ఉన్న తునికాకుకు సబంధించి ఇంత వరకు ప్రూనింగ్ పనులను చేపట్టలేదని వెంటనే టెండర్లను పిలిచి పనులను చేపట్టాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

ములుగు రూరల్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలు పెరుగని పోరాటాలు చేపడుతుందన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. మెస్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల, ఖాళీ పోస్టుల భర్తీల విషయంలో సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. ఈ నెల 10, 11వ తేదీలలో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోకల రవి, రవితేజ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



ములుగు రూరల్: సంబురాల్లో నాయకులు



గోవిందరావుపేట: పస్రాలో



ఏటూరునాగారంలో..

ములుగు రూరల్: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు సంబురాలు శనివారం చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాణా సంచా కాల్చి , స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు ఆదరించి అఖండ విజయం కట్టపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, నాయకులు రవీంద్రాచారి, కృష్ణాకర్, సూర్యదేవర విశ్వనాథ్, రవిరెడ్డి, రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఢిల్లీలో బీజేపీ గెలవడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి మాట్లాడుతూ.. 27 సంవత్సరాల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి రామరాజు, రాకేష్, గాడిచర్ల రాజశేఖర్, ఎర్రల ఎల్లయ్య, అటికె కృష్ణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: ఢిల్లీలో విజయం సాధించడంతో మండల పరిధిలోని పస్రా చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాణాసంచను పేల్చి, మిఠాయిలు తినిపించుకోని విజయోత్సవ సంబురాలు నిర్వహించుకున్నారు. దేవేందర్ రావు, జాడి వెంకట్, రవీందర్‌రావు, సుధాకర్ రెడ్డి, ధర్మారావు, పాండు, భాను, సత్యనారాయణ, రవిశంకర్, రమేష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

'అక్రమంగా మొరం తవ్వకాలు'

వాజేడు: మండల కేంద్రంలో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారని ఆదివాసీ లిబరేషన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు దబ్బ కట్ల సుమన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయానికి కేవలం 300 మీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మొరం తోలుతున్నా అధికారులు స్పందించక పోవడం సమంజసం కాదన్నారు. ఏటూరు నాగారంలోని పట్టా క్వారీ కోసం వాజేడు మండలం నుంచి మొరం తీసుకెళ్లడం అది కూడా పెసా చట్టాన్ని తూట్లు పొడవడమేనన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా గ్రామ సభ జరిగిన తరువాత ఇసుక, మొరం తొవ్వకాలు జరుపాలని రాజ్యాంగంలో నిబంధనలు ఉన్నప్పటికీ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. అధికారుల్లో స్పందన లేదని కలెక్టర్ కల్పించుకోవాలని విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలను తీసుకోవాలని కోరారు.

సెంట్రల్ లైట్ల ఏర్పాటు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయం, ఓడవాడ, బొడ్రాయి, జెడ్పీహెచ్ఎస్, కూరగాయాల మార్కెట్, వైజంక్షన్ పరిసర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ శనివారం తెలిపారు. ప్రధాన రోడ్డు పై ఉన్న లైటింగ్‌తోపాటు వీటిని కూడా వెలిగించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడి లైట్లకు అక్కడే కనక్షన్లు అమర్చి ప్రజలకు వెలుగు నింపే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఆయన వెల్లడించారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి



నిరసన చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించి ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించడం వలన మౌలిక వసతుల అభివృద్ధి జరిగితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన తప్పుడు విధానాలు అనుసరించకుండా ఆ విధానాలను గుణపాఠంగా తీసుకోని నేటి ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రమణారెడ్డి, ప్రవీణ్, తిరుపతి, జగపతిరావు, శివశంకర్, రాంసింగ్, వీరేశం, వీరయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూకల్ గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఏలాంటి ఆపద వచ్చిన తాము అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకనే సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాగా ఉండాలంటే రానున్న స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, నాయకులు పిట్ట సురేష్, తౌటం నవీన్, జంబుల తిరుపతి, మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీదేవి, మల్లక్క, రాంబాబు పాల్గొన్నారు.

తాటిచెట్లు తొలగించడంపై ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న గౌడ కులస్తులు

కాటారం: కాటారం–మంథని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని శంకరాంపల్లి సమీపంలో తాటిచెట్లు తొలగించడంపై శనివారం గౌడ కులస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోడ్డు పనుల కాంట్రాక్టర్ తమకు సమాచారం ఇవ్వకుండా చెట్లు ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాటి చెట్ల ద్వారా తాము జీవనోపాధి పొందుతున్నామని అలాంటి చెట్లను తొలిగించడం శోచనీయం అన్నారు. చెట్ల తొలగింపుపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీటూరి రాజలింగు, మార్క రవి, మారగోని రాజబాబు, చీకట్ల స్వామి, గణపతి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన

మొగుళ్లపల్లి: మండలంలోని మొగుళ్లపల్లి, మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి, జిల్లా యువజన క్రీడల అధికారి సీహెచ్.రఘు, ఎన్‌సీసీ అధికారి రాజయ్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి సుకాంత్ కుమార్, ఉపాధ్యాయులు నరసింహ స్వామి ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సునీల్

చిట్యాల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు మ్యాదరి సునీల్ అన్నారు. శనివారం మండలంలోని జూకల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజ సేవ కోసం, బడుగు బలహీన వర్గాల కోసం, సేవ చేయడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మిస్ ప్యాబ్లాస్ ఇండియా ఫస్ట్ రన్నర్ ఆఫ్ ఈవెంట్ బై వివెంటిజ్ బల్ల శ్రీహర్షిత, వర్షవర్ధిని, జానపద గేయ రచయిత దాసారపు నరేష్, బానోత్ రాజు నాయక్, ఉపాధ్యాయులు రఫీ, యోగి ఉన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమకు సహకరిస్తాం..



రేగొండ: మండలంలో జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆహార శుద్ధి పరిశ్రమకు సహకరిస్తామని నాబార్డ్ ఏజీఎం రవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం సొసైటీ అధ్యక్షుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.30 కోట్లతో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమతో వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తామని తెలిపారు. రవీందర్ రెడ్డి, కిరణ్, రాజు, మధు పాల్గొన్నారు.